# కోనేటి జన్మ

నేడు సుదినం. నేడు కోటినేరావు జన్మదినం.

మహారాజరాజశ్రీ హెడ్డు గుమాస్తా జటావల్లభుల కోనేటిరావు పంతులుగారి నలభై ఆయిదో జన్మదినం ఈరోజన్న సమాచారం మరారాశ్రీకే తెలియదు. కోనేటి జన్మదినం జాతీయపర్వదినం కాదు. దీనికొాక ప్రత్యేకత నాపాదించి పండుగ చేసుకో వలసిన అవసరం కోనేటిరావుకే లేకపోయింది. తూర్పు ఆసియా దేశాలలో ప్రళయం. పశ్చిమ యూరప్ దేశాల ప్రణయం. మధ్యప్రాచ్యంలో మంత్రసాని గండం మొదలైన ప్రపంచ ప్రచండ వార్తల మధ్య ఇదివరకెప్పుడో నలభై నాలుగేళ్ళ కిందట కోనేటి రావనే ఆసామి ఒకానొక పల్లెటూళ్ళో జన్మించాడన్న కబురు, ఈ రచయితని తప్ప యింకెవ్వరినీ ఉత్సాహపరచలేకపోయింది.

అయినా ఈ దినం కోనేటిరావు పుట్టిన రోజని తెలిసినప్పటికీ ఈ రచయిత "డాండడడాండడాండ ంనదంబు లజాండమునిండ మత్తవేదండమునెక్కి" ఈ సంతోషవార్తని చాటలేక పోతున్నాడు. దీన్ని ఎలా వర్ణించాలో తెలియక యిబ్బంది పడుతున్నాడు. "నేడు సుదినం" అని మాత్రం అని ఊరుకున్నాడు. ఇది ఎంచేత సుదినమో ఈ రచయితకి కూడ తెలియదు.

కిందటేడు కూడా ఇలాగే నలభై నాలుగో కోనేటి మైలురాయి నామమాత్రావశిష్టమైపోయింది. మీదటికైనా ఇంతకన్న ఉత్తమ పరిస్థితులలో కోనేటిరావు పుట్టిన రోజు పండుగ చేసుకోగల సూచనలు సుతరామూ కన్పించవు. ఈ లోపున అమెరికాలో కొందరి పెద్దల ఆశీర్వాదంవల్ల యుద్ధమే వచ్చేస్తే, సరి! మరి కోనేటిరావే కనిపించడు.

కోనేటిరావుగారి నలభై అయిదో జన్మదినంనాడు వాళ్ళ ఆఫీసుకి సెలవులేదన్న విషాదవిషయం ఒక్కటి మినహాయిస్తే తతిమ్మా లాంఛనాలన్నీ— కోనేటిరావుకి తెలియకుండా—సక్రమంగానే జరిగినట్లు చెప్పవచ్చును. తెల్లవారుజామున మలయానిలం మందమందంగా ప్రసరించింది. అదృష్టవశాత్తూ ఇది వసంతకాలం కావడంవల్ల

మామిడి చెట్లు చిగిర్చడం, ఆ చిగుళ్లు మెసవి కొన్ని కోకిలలు పంచమస్రావ్యంగా వగర్చడం జరిగింది. తిరుచినాపల్లి రేడియోలో యెవరో సుప్రసిద్ధ సోదరులు మంగళ వాద్యాలు మ్రోగించారు. చాలా రోజులనించీ సాక్షాత్కరించని చాకలివాడు (చిరిగి పోయినవైతేనేం) బట్టల నన్నింటినీ బాకీ పెట్టకుండా తీసుకొచ్చాడు. మరి ఆవిడకి తెలిసేచేసిందో తెలియకచేసిందో తెలియదుగాని కోనేటిరావు భార్య బహురుచ్యమైన పిండివంటలుచేసి ఆఫీసు వేళకి ముందుగా వడ్డించింది. మస్తుగా భోజనంచేసి అవిఘ్న మస్తుగా కోనేటిరావు ఆఫీసుకు చేరుకున్నాడు.

కోనేటిరావు ఆఫీసు యాత్రని కొండొకచోట ఈ రచయిత ఇదివరకు వర్ణించాడుగాని పునరుక్తి అవుతుందని కూడా వెనుదీయకుండా ఆ ప్రయాణాన్ని మళ్ళీ వర్ణించడాని కితడు ఉవ్విళ్లూరుతున్నాడు. అసలే కూర్మావతారం. అరమైలు ఆఫీసు దూరం రొప్పుతూ రోజుతూ కోనేటిరావు యింటినుండి ఆఫీసుకి బయలువెడలెను. "వెడలెను కోదండపాణి" అని గాని, "రాజువెడలె రవితేజములలరగ" అనిగాని ఈ వెళ్ళడాన్ని ఎవరూ పాడడానికి సాహసించరు. ఒక గుమస్తా తన పుట్టిన రోజున ఆఫీసుకి వెళ్ళాడన్న విషయంలో సంగీతాన్నీ కవిత్వాన్నీ ప్రోత్సహించే పరిద్రవం యత్కించిత్తూ ఉండనేరదు. ఆపసోపాలుపడుతూ ఆఫీసుకి పోతూన్న ఒక మానవుడి మహా ప్రస్థానం సౌందర్యవంతమైన సంఘటన కాదు. ఇదేమీ హైదరాబాదు ప్రతినిధుల పారిస్ ప్రయాణం కాదు. ప్రధానమంత్రిగారి సరిహద్దు పర్యటన కాదు. కోనేటిరావు అరమైలు దూరాన్ని అవలీలగా లంఘించి శాశ్వతంగా ఒక కొత్తరికార్డు స్థాపించాడనడం సత్యానికి అనేక లక్షల మైళ్ళ దూరం. కోనేటిరావు రోజూలాగే ఈ రోజు కూడా ఈసురోమంటూ జీవిత సముద్రంలో ఈదుతున్నాడు. ఇదేమీ రసవంతమైన సన్నివేశం కాదని ఈ రచయిత ఇంకోసారి మనవిచేసుకుంటున్నాడు.

కోనేటిరావు జీవితరంగంలో ఏమూలనుంచి కూడా ఏమాత్రమూ కవిత్వమనేది ప్రసరించకుండా కట్టుదిట్టాలు జరిగిపోయాయి. ఎందుచేత అని ప్రశ్నిస్తే ఏ జవాబూ రాదు సరికదా ఎన్నో ప్రశ్నలు బయలుదేరుతాయి.

ఏ శాపంవల్ల కోనేటిరావు తన నలభై అయిదో పుట్టినరోజున హాయిగా ఇంట్లో కూర్చోకుండా ఎండలో ఈదవలసి వచ్చింది? అతని పిల్లల చొక్కాలూ లాగులూ

అతుకుల బొంతలు కావడానికి కారణ మేమిటి? దాక్షిణ్యంలేని ఏ దుర్విధి శాసనంవల్ల కోనేటిరావు తలమీద చాలామట్టుకి జుట్టు ఊడిపోయి బట్టతల ప్రాప్తించడమే కాక ఉన్న జుత్తూ తెల్లబడిపోయింది? అతని చెమటతో తడిసిన రూపాయలకి అర్థంలేక పోవడం ఎంచేత?

ఏం ప్రయోజనంలే ఇలాంటి ప్రశ్నలు వేస్తే!

కోనేటిరావు తన నలభై అయిదో పుట్టినరోజున ఆఫీసులో కుర్చీలో కూర్చుని పనిచేసుకుంటున్నాడు. ఇదివరకు అతణ్ణి కనబడకుండా బంధించిన సంకెళ్ళు ఇంగ్లాండులో తయారైనవి. ఇప్పటి సంకెళ్ళను ఇండియా తయారుచేస్తోంది. ఇవి స్వదేశీ సంకెళ్ళు

ఏమైనా ఇది సుదినం. ఇది కోనేటిరావు జన్మదినం.